క్లుప్తంగా

కర పత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

శ్రీకాళహస్తి: సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ అమ్మపాళెం, చుక్కల నిడిగల్లు సీపీఐ శాఖ వారు కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జనమాల గురవయ్య మాట్లాడుతూ సీపీఐ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో జిల్లా రెండవ మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, బుజ్జమ్మ, పోలయ్య, చెంచయ్య, భరత్, వెంకటమ్మ, రాజేశ్వరి, శానమ్మ, మునెమ్మ పాల్గొన్నారు.

శనీశ్వరునికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వెంకట్రామిరెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

రేణిగుంట: గాజులమండ్యం గ్రామానికి చెందిన అవిలల రాజశేఖర్ తండ్రి, తెలుగు పండితుడు అవిలల వెంకట్రామి రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆయన కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి గ్రామానికి వెళ్లి వెంకట్రామిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్దగుంట సుధాకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

ఏర్పేడు: మండలంలోని అముదూరు పంచాయతీ బండివానిపల్లె, చింతలపాళెంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అపహరించారు. బండివానిపల్లిలో రైతులు గుండాల సుబ్బరామయ్య, పండయ్య, మరో ముగ్గురు రైతుల విద్యుత్ మోటార్లు చోరీ చేశారు. అలాగే చింతలపాళెంలోనూ మరో మూడు వ్యవసాయ మోటార్లు అపహరించారు.

ఆటో ఢీకొని చిన్నారికి గాయాలు


బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్తపాళెం గ్రామంలో శనివారం ఆటో ఢీకొనడంతో చిన్నారికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన లోకేష్ కుమార్తె అనన్య(3) వీధిలో ఆడుకుంటూ వుంది. పాలు సేకరణకు వచ్చిన ఆటో బాలికను ఢీకొంది. గాయపడిన చిన్నారిని శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం


డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ చిన్నదొరై సుధా

నాగలాపురం: మండలంలోని ఉత్తరపు కోటవీధిలో శనివారం సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో డ్రైనేజీ పనులు ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా వర్షకాలంలో డ్రైనేజీ లేనందున వర్షపు నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి. ఉత్తరపు కోట వీధిలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచ్‌కు విన్నవించుకున్నారు. ఈ విషయంపై స్పందించిన సర్పంచ్ 15వ ఫైనాన్స్ నిధులతో రూ.3.50 లక్షలు కేటాయించి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆ వార్డులోని ప్రజలు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత, నాయకులు ఉదయ్ కుమార్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి, ధనరాజ్, గౌతమ్, చిరంజీవి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ తొలగింపు



రేణిగుంట: ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన ఫెన్సింగ్‌ను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తొలగించారు. సర్కారు భూమిని ఎవరు కబ్జా చేయాలని చూసినా సహించే ప్రసక్తే లేదన్నారు. కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

కష్టాల కాజ్‌వే!

తడ–శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలో వరదయ్యపాళెం మండల గోవర్ధనపురం వద్ద మారేడు కాలువపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వే శిథిలావస్థకు చేరింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో గుంతలమయంగా మారిపోయింది. ఈ ప్రాంతంలో హైలెవల్ వంతెన నిర్మించాల్సిన అవసరముంది. అయితే అధికారులు మాత్రం కేవలం పరిశీలనకే పరిమితమవుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు ట్రాఫిక్ స్తంభిస్తే తూతూమంత్రంగా మరమ్మతులు చేయించి చేతులుదులిపేసుకుంటున్నారు. శ్రీసిటీ నుంచి ఈ మార్గంలోనే ప్రయాణించిన పరిస్థితి ఉండడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అత్యంత ప్రాధాన్యత గల ఈ రహదారిని ఆధునికంగా తీర్చిదిద్దడంతో పాలకులు సైతం మీనమేషాలు లెక్కిస్తున్నారు.

కాజ్‌వేపై భారీ గుంతలు



- గోవర్ధనపురం వద్ద గుంతలమయంగా వంతెన
- పరిశీలనకే పరిమితమైన అధికారులు
- ఇప్పటికీ మంజూరు కాని నిధులు
- వాహనదారులకు తప్పని తిప్పలు



చిధ్రమైన గోవర్ధనపురం లో లెవల్ కాజ్‌వే, కాజ్‌వేను పరిశీలిస్తున్న తుడా వైస్ చైర్మన్, ఎమ్మెల్యే (ఫైల్)

వరదయ్యపాళెం: గోవర్ధనపురం వద్ద మారేడు కాలువ ప్రవహిస్తోంది. దీనిపై ఏళ్ల క్రితం లోలెవల్ కాజ్‌వే నిర్మించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వాహనాల రద్దీ రీత్యా ఇది పూర్తిగా దెబ్బతింది. దీంతో నిత్యం కాజ్‌వే ప్రాంతంలో గుంతలు ఏర్పడి వాహనదారులు నరకయాతన పడుతున్నారు. అయితే వంతెన అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యమెందుకు?

రోజువారీ శ్రీసిటీలోని పరిశ్రమలకు వందలాది వాహనాల్లో కార్మికులు వరదయ్యపాళెం మీదుగానే వెళ్లాలి. ఈ నేపథ్యంలో గోవర్ధనపురం వద్ద హైలెవల్ వంతెన నిర్మించాలి. లేదా అప్పటి వరకు ప్రస్తుతమున్న లోలెవల్ కాజ్‌వేకు మరమ్మతులు చేయించాలి. అయితే ఆ దిశగా ప్రభుత్వం స్పందించడం లేదు. నిధులు మంజూరు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది మార్చి 15న అప్పటి తుడా వైస్ చైర్మన్ మౌర్య సైతం ఈ కాజ్‌వేను పరిశీలించారు. అయినా ప్రయోజనం శూన్యమని స్థానికులు వాపోతున్నారు.

హైలెవల్ వంతెన కలేనా?

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో గోవర్ధనపురం వంతెన వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం తప్పనిసరి. దీనిపై ఆర్ అండ్ బీ అధికారులు ప్రభుత్వానికి సైతం నివేదిక అందజేశారు. రూ. 4కోట్లు అవసరమని ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అయితే కూటమి ప్రభుత్వంలో మాత్రం చలనం లేదు. అంతేకాక పూర్తిగా దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వే ప్రాంతంలో సీసీ కాంక్రీటు నిర్మాణ పనులకు అత్యవసరంగా రూ. 20లక్షల నిధులు అవసరమని కలెక్టర్‌కు నివేదించినప్పటికీ స్పందించకపోవడం గమనార్హం.

నిధులు మంజూరు చేయాలి



ప్రాధాన్యత కలిగిన రోడ్డు మార్గంలో శిథిల దశకు చేరుకున్న గోవర్ధనపురం లోలెవల్ కాజ్‌వే అభివృద్ధికి తక్షణమే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యం వహించడం తగదు. ప్రస్తుతం పనులు చేపట్టకపోతే వర్షాకాలంలో ఇబ్బందులు తప్పవు. రాకపోకలు ప్రశ్నార్థకమవుతాయి. ఈ పరిస్థితులను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి. –సిద్ధిక్, వరదయ్యపాళెం

వంతెన అవసరం



గోవర్ధనపురం వద్ద ఉన్న లోలెవల్ కాజ్‌వే ప్రాంతంలో ప్రస్తుత వాహనాల రద్దీ రీత్యా హైలెవల్ కాజ్‌వే తప్పనిసరి. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం స్పందించి హైలెవల్ వంతెన నిర్మాణానికి చొరవ చూపాలి. శ్రీకాళహస్తి నుంచి తడకు వెళ్లాలంటే వరదయ్యపాళెం మీదుగా వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఈ వంతెన అభివృద్ధి వాహనదారులకు అత్యవసరం. –బుర్రా కృష్ణమూర్తి, వరదయ్యపాళెం

మృతురాలి కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న సుబ్రమణ్యం

తొట్టంబేడు: బోనుపల్లెలో శనివారం మృతి చెందిన కట్టబోయిన నాగలక్ష్మికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోగిల సుబ్రమణ్యం నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్యనాయుడు పాల్గొన్నారు.

స్టిక్కర్లు వేసుకుంటే కఠిన చర్యలు


ఎస్‌ఐ సునీల్

నాగలాపురం: మండలంలో ఎవరైనా ప్రెస్, పోలీస్ బైకులపై స్టిక్కర్లు ఎవరు పడితే వారు వేసుకుంటే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని, వాటిని వెంటనే తొలగించాలని లేకుంటే వారి మీద చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ సునీల్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులు, లేదా వాస్తవ పోలీసు సిబ్బంది మాత్రమే, అది కూడా వారి సొంత వాహనాల మీద మాత్రమే స్టికర్లను వాడే హక్కు ఉంటుందన్నారు. అలా కాకుండా అనధికారికంగా ప్రెస్, పోలీసు అని బైకులపై స్టిక్కర్లు వాడితే మాత్రం వారి మీద చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ చర్యల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. వాహనాలపై అక్రమంగా స్టిక్కర్లు వాడుతున్న వారిపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలోని సర్వే నంబరు 21–1లో 9.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడంతో తహసీల్దారు శ్రీదేవి, వీఆర్‌ఓ జయలక్ష్మి, సిబ్బందితో కలసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి ఆక్రమణపై గ్రామస్తులు తనకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టరు ఆదేశాల మేరకు ఈ భూమి స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం భూమిని ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లోని బాలికలకు శనివారం వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి సిబ్బందితో కలసి బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను వాటిని ప్రోత్సహించినా, పెళ్లిళ్లు చేసినా జైలు శిక్ష తప్పదన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం జరిపించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం హాస్టల్ వంటగదిని పరిశీలించి, విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశులు, వార్డన్ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలకు స్విచ్‌ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


చిత్తూరుకండ్రిగలో ఏర్పాటు చేసిన స్విచ్

నారాయణవనం: మండలంలోని చిత్తూరు కండ్రిగ ఏఏడబ్ల్యూలో నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలకు స్విచ్‌లను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్ తెలిపారు. తుంబూరులో రాత్రి వీధి దీపాలు వెలగడం లేదని, చిత్తూరు కండ్రిగ ఏఏడబ్ల్యూలో నిరంతరం వెలుగుతూనే ఉన్నా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోలేదని సాక్షి దినపత్రికలో 'పగలు వెలుగులు–రాత్రి చీకటి' శీర్షికన శనివారం ప్రచురితమైన వార్తకు ట్రాన్స్‌కో ఏఈ స్పందించారు. చిత్తూరుకండ్రిగ ఏఏడబ్ల్యూలో నిరంతరం వెలుగుతున్న దీపాలకు స్విచ్‌లను ఏర్పాటు చేశారు. సాక్షితో జయప్రకాష్ మాట్లాడుతూ వీధి దీపాలను పంచాయతీలు నిర్వహించాలని అన్నారు. విద్యుత్ వృథా కాకూడదన్న కారణంతో చిత్తూరుకండ్రిగ ఏఏడబ్ల్యూలో సొంత ఖర్చులతో స్విచ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. తుంబూరులో కొత్తగా ఏర్పాటు చేసిన లైన్లకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడానికి వైర్లను పంచాయతీ సరఫరా చేయాల్సి ఉందన్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది అరణ్యకండ్రిగ, తుంబూరు కార్యదర్శులు, సర్పంచ్‌ల దృష్టికి తీసుకువచ్చామని ఆయన తెలిపారు.

శ్మశాన స్థల సమస్యపై విచారణ


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువరత్తూరు గ్రామంలోని శ్మశాన స్థల సమస్యపై శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి విచారణ చేపట్టారు. వెస్టువరత్తూరు గ్రామ రెవెన్యూ పరిధిలో 313–1, 313–2, సర్వేనంబర్లలోని 4 సెంట్లు భూమిని వెంకట్రామిరెడ్డి శ్మశానానికి విరాళంగా ఇచ్చారు. ఈ భూమిలో శవాలను దహనం చేస్తున్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి శ్మశానం భూమి తమదని అధికారులకు ఫిర్యాదు చేయడంతో సమస్య మొదలైంది. ఆపై లక్ష్మీరెడ్డి తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదు చేయడంతో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ తిమ్మయ్య, తహసీల్దారు శ్రీదేవి, ఎస్‌ఐ విశ్వనాథనాయుడుతో కలిసి గ్రామంలో విచారణ చేపట్టారు. లక్ష్మీరెడ్డితో పాటు గ్రామస్తులు రవిరెడ్డి, మునిచంద్రారెడ్డి, వీరరాఘవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డిని విచారించారు. అనంతరం తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ భూమిని పలు దఫాలు సర్వే చేయించామని, శ్మశాన భూమి రికార్డులో వెంకట్రామిరెడ్డి పేరుతో, భూమి ఆయన స్వాధీనంలోనే ఉండేదన్నారు. గ్రామంలో శ్మశానం పేరుతో శాంతిభద్రతల సమస్య సృష్టించవద్దని తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్‌క్లినిక్


బత్తలవల్లంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం గ్రామ పంచాయతీ ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.22 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని నిర్మించారు. అయితే గత ఏడాది బిల్లులు రాని కారణంగా భవనాన్ని ప్రారంభించేందుకు గుత్తేదారు అంగీకరించలేదు. ప్రస్తుతం బిల్లు కూడా కొంతమేరకు జమ అయినట్లు గుత్తేదారు చెబుతున్నారు. ప్రారంభోత్సవానికి గుత్తేదారు నుంచి ఎలాంటి అభ్యంతరం లేదని చెబుతున్నప్పటికీ, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పల్లె ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించడం కోసం చేపట్టిన గత ప్రభుత్వ సంకల్పానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. స్థానిక గ్రామస్తులు సైతం ఇటీవల పలుమార్లు తమ గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించాలని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు కోరినట్లు చెబుతున్నారు. అయినా ఇప్పటివరకు స్పందన లేదని వారు వాపోతున్నారు. రూ.22 లక్షలతో నిర్మించిన ఆ భవనాన్ని మూసి ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ ఇక్కట్లు

శ్రీకాళహస్తి: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల అలసత్వం కారణంగా దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులకు ధ్రువీకరణ పత్రాలు అవసరం కావడంతో పిల్లలు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే రెవెన్యూ సిబ్బంది మాత్రం వీఆర్‌ఓ లేరని, డీటీ సెలవు పెట్టారని సాకులు చెబుతూ విద్యార్థులను తిప్పుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జాప్యం లేకుండా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఎస్వీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ హాస్పిటల్ వారితో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎస్వీఎస్ ఫౌండేషన్ నిర్వాహకులు విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. కంటి సమస్యలతో బాధ పడుతున్న వారు ఉచిత వైద్యశిబిరంలో సేవలు పొందాలని ఆమె కోరారు.

వైభవంగా ఊంజల్ సేవ


ఊయలపై దేవదేవేరులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదేవేరులను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి విశేష పూజలు జరిపించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకుడు నరసింహభట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర


శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో సేవించుకున్నారు. వీరిలో మంత్రి కొల్లు రవీంద్ర, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద వారికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓవో బాపిరెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం


మాట్లాడుతున్న వైద్యాధికారి

రేణిగుంట: క్షయ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని మెడికల్ ఆఫీసర్ సయ్యద్ జుబేరి అహ్మద్ తెలిపారు. శనివారం కరకంబాడి ఆంజనేయపురం సచివాలయంలో సూపర్‌వైజర్ సుమశ్రీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సయ్యద్ జుబేరి అహ్మద్ మాట్లాడుతూ దగ్గు రెండు వారాలు మించి వస్తుంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తిస్తే పూర్తిస్థాయిలో ప్రభుత్వమే ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి శివ శంకర్ రెడ్డి, వైద్యాధికారులు యశ్వంత్, శివశంకర్, మంజుల, బుజ్జి నాయుడు పాల్గొన్నారు.

వైభవం.. రథోత్సవం




చిన్నారుల నృత్యప్రదర్శన


సత్యసాయి ఊరేగింపు

శ్రీకాళహస్తి: పట్టణంలో భగవాన్ శ్రీసత్య సాయి రథోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. సత్య సాయి సేవ సమితి కన్వీనర్ పాండురంగారావు మాట్లాడుతూ సత్య సాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రేమవాహిని పేరిట స్వామివారి చిత్రపటాలను ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. పుట్టపర్తి ఆలయం నుంచి మే 6వ తేదీన ప్రేమ వాహిని రథోత్సవాలు చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 30వ తేదీకి ఉత్సవాలు పరిపూర్ణమవుతాయని చెప్పారు. సేవా సమితి జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్, మాజీ ఉపాధ్యక్షుడు వరప్రసాద్ నేతృత్వంలో ఉదయం కొత్తకండ్రిగ నుంచి ప్రేమ ప్రవాహిని రథోత్సవం ప్రారంభించామన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో ఉన్న సత్య సాయిమందిరం వరకు ఉత్సవం కొనసాగినట్లు తెలిపారు.